

# ఎన్.టి.ఆర్ పురాణ పాత్రలు

– డా. నందమూరి లక్ష్మీపార్వతి



*డా.లక్ష్మీపార్వతిగారు డాక్టరేట్ కోసం సమర్పించిన సిద్ధాంతగ్రంథం **'ఎన్.టి. ఆర్ పురాణపాత్రలు – భారతీయ పురాణ సంప్రదాయం చలనచిత్ర శైలీకరణ'** నుంచి ఎంపిక చేయబడిన కొన్ని భాగాలు - కౌముది పాఠకులకోసం ప్రత్యేకం..!!*

## (గత సంచిక తరువాయి)

### భీముడు

నర్తనశాలలో 'అర్జునుడు'గా రామారావుగారు మంచిపేరు తెచ్చుకున్నాక వారి దృష్టి పాండవ ప్రముఖుడు భీముడి మీద పడింది. బభ్రువాహన చిత్రం ఆశించిన విజయం సాధించలేదు. ఆ తర్వాత పాండవ వనవాసం చిత్రీకరణ జరిగింది. విభిన్న పాత్రలు నటించాలనే తపనున్న రామారావుగారు, ఈ చిత్రంలో భీముడిగా నటించి ఒప్పించి మెప్పించారు – పూర్తి వీర రస ప్రధానమైన భీమ పాత్రను కూడా శృంగారం జోడించటం ఇందులో నూతనాంశం. భారతాంతర్గమైన ఈ కథ ఎన్నో కల్పనలకులోనైనా బాధలు పడి 'మాయాబజారు' సరళితో ముగింపునకు వస్తుంది. యన్.టి.ఆర్‌పట్ల, మాయాబజార్ చిత్రం పట్లా వున్న ప్రేక్షకాదరణ సామాన్యమైంది కాదు. ఎన్ని మలుపులు తిరగనీ, ఎన్ని గిరికీలు కొట్టనీ, వాళ్ళ కిష్టమైన కథానాయకుడు, నచ్చిన సన్నివేశాలుంటే చాలు చిత్రం ఆర్థిక విజయాన్ని సాధిస్తుందనే విషయాన్ని ఈ చిత్రం నిరూపిస్తుంది. సగం వరకు మూలకథననుసరించి సాఫీగా నడుస్తుంది. ప్రధాన కథానాయకుడు కథకు మొదట, మధ్యలో, చివరలో ఇలా ఆద్యంతాల్లో కథను తానే నడిపిస్తాడు కనుక, ఈ చిత్రంలో ప్రధానపాత్రధారి భీముడు కనుక, ఆయనే శశిరేఖాభిమన్యుల పెళ్ళి కూడా చేసేస్తాడు. అలా తన ఆధిపత్యాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకుంటాడు. ఇలాటి ధీరోద్ధతమైన పాత్రలు ఎన్.టి.ఆర్‌గారికి కొట్టిన పిండి, వాటిని ఆయన చాలా అలవోకగా నటించేవారు. అయితే భీమపాత్ర అన్ని పాత్రలను పక్కన కూర్చోబెట్టిందనే సహృదయుల బాధలో దోషం లేదు. ఇందులో 'పాపం! ధర్మరాజు' అని జాలి కలుగుతుంది. సర్వస్వతంత్రంగా ఎవరిమాట లెక్కచేయని స్వేచ్ఛా జీవిగా భీముని పాత్రను మలచినా, అలా పాత్రౌచితి దెబ్బతిందనిపించినా చిత్రం మాత్రం పూర్తిగా విజయవంతమైంది. శృంగారపరంగా ఒక యుగళగీతంలో లలిత సన్నివేశం మలచినా, సన్నివేశంలో ఎక్కడా ఆ ఔద్ధత్యం సడలకుండా ఆ పాత్ర వెనక వున్న రసదృష్టి చెడకుండా అభినయించడంలో ఔచిత్యం పాటించారు. కొత్త శైలీకృతమైన హావభావ ప్రకటనలున్నా, అవి రసభంజకం కానివ్వకుండా జాగ్రత్తపడ్డారు. అందులో ఆహార్యం పాత్రోచితం, అభినయం. భీముడిగా కూడా ఎన్.టి.ఆర్ గారు తన విజయచరిత్రలో మరో అధ్యాయాన్ని సృష్టించుకున్నారు.

### ప్రతినాయకుడు దుర్యోధనుడు

రామారావుగారు మూడు చిత్రాల ద్వారా దుర్యోధన పాత్ర పోషించారు. 1.శ్రీకృష్ణపాండవీయం. 2.దానవీరశూరకర్ణ, 3. విరాటపర్వం. ధీరోదాత్తుడైన ప్రతినాయకుడు దుర్యోధనుడు. సాహిత్యంలోనూ, జన సామాన్యంలోను దుర్మార్గుడుగా, మత్సరగ్రస్తుడిగా

చిత్రించబడ్డ పాత్ర ఇది. ఆ పాత్రనుండే ఒక అభిమానధనుడిని, ఒక మంచి మిత్రుడిని, కులవ్యవస్థ మీద తిరుగుబాటుచేసిన కథానాయకుడిని మలచటం విశేషం. ఆ పాత్ర సంభాషణల్లో గొప్ప భావవిప్లవాన్ని పొందుపరిచారు. కర్ణుడిని మిత్రుడిగా ఆదరించటం ద్వారా అతనిలో స్నేహ ప్రవృత్తిని వెలికి తీసి చూపించారు. శ్రీకృష్ణపాండవీయంలో, నటనకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. కానీ 'దానవీరశూరకర్ణ' ఆ పాత్ర ఔన్నత్యాన్ని చూపించటానికి అడుగడుగున ప్రయత్నించటంలోనే ఆ పాత్రను తాను మలచుకున్న విధానంలో శోభాయమానం చేయాలనే నిర్ణయం స్పష్టమౌతుంది. పురాణ పాత్రలను తన భావానుగుణంగా మూలంలోని ఔచిత్యం చెడకుండా మార్చటంలో ప్రయోగాత్మతేకాదు, మరే సాహిత్యమైనా సమకాలీన వర్తమాన సమాజానికి అనువర్తితం అయినప్పుడే అది సంస్కరణశీలమైన వునికితో ముందుకు నడుస్తుంది అనే ఆశయం కూడా రామారావుగారికుంది.

బహుశా అది సాధించారనుకుంటాను. వ్యవస్థ, దాని అభిరుచులు ఎప్పుడూ ఒక మూసలో పోసి వుండవు. కాలగతమైన మార్పులు వాటిని మారుస్తుంటాయి. సమాజం మనస్ఫూర్తిగా ఆ మార్పులను ఆహ్వానిస్తుందనటానికి కారణం ఎన్.టి.ఆర్గారి ప్రతినాయక పాత్రల విజయాలే. అయితే శ్రుతి మించి, హద్దు దాటితే ప్రేక్షకులు త్రిప్పి కొడతారనటానికి వారి మూడో చిత్రం విరాటపర్వం సాక్ష్యం. సంభాషణ రీతిలో కొండవీటి వెంకటకవిగారి అతివేలత, దర్శకత్వంలో కూడా కొద్దిపాటి లోపాలు చిత్రకథనంలో బలహీనతలు విరాటపర్వ చిత్రవిజయాన్ని దెబ్బతీసాయి - అది వేరే విషయం.

'దానవీరశూరకర్ణ' ప్రేక్షకాదరణ పొందింది. నిజానికి 'శ్రీకృష్ణపాండవీయం' దుర్యోధనుడికి, కర్ణ చిత్రంలో దుర్యోధనుడికి అభినయంలో చాలా తేడా వుంది. మొదటగా దుర్యోధన పాత్రను నటించాలనే గాఢమైన కోర్కె రామారావుగారిలో కలగడానికి బలమైన ప్రేరణ లేదా కారణం ఎస్వీ.రంగారావుగారి దుర్యోధన అభినయమేనని అంటారు. మిగిలినవారికంటే పైచేయి అనిపించుకున్నారు. "స్పర్ధయావర్ధతే విద్యా" అన్నట్లు, కళావిద్యలో కూడా స్పర్ధ కొత్త ప్రమాణాలకోసం తపనను పుట్టిస్తుంది. ఫలితంగా శ్రీకృష్ణపాండవీయంలో దుర్యోధన పాత్రను రామారావుగారు నటించారు. కానీ అప్పటికీ కళావిమర్శకులు రంగారావుగారి అభినయాన్నే ప్రశంసించడంతో పట్టుదల గల రామారావుగారు మళ్ళీ కర్ణ చిత్రంలో దుర్యోధనుడిగా నటించారు. ఆ వైరుధ్యం చాలా స్పష్టంగానే కనిపిస్తుంది. అయితే అభినయమే ప్రధానంగా తీసుకుని కొన్నిచోట్ల ఔచిత్యం దెబ్బతీసుకున్నారు. అది కథా వివరణలో ముందురాగలదు - అందరూ మెచ్చుకోవాల్సింది ఒకటి. వారి ధైర్యాన్ని, రెండు వారి సంభాషణావేగాన్ని. స్ఫుటమైన గొంతుతో, ప్రతి పదాన్ని పలికేతీరు ఆ ఊనిక మరే నటుడిలో కనిపించవు. శైలీకరణలో అలాటి రీతుల్ని ఏర్పరచుకోవటమే ఒక ముఖ్యభాగం. ముఖ్యంగా దీర్ఘసమాస భూయిష్టమైన సంభాషణలు వారికి ప్రాణం. బరువు పాత్రలు, బరువైన ఆహార్యం, బరువు సంభాషణలు వారిష్టపడతారు. ఏమైనా ప్రతినాయకుడైన దుర్యోధనుడిలో కథానాయక లక్షణాలు చొప్పించి ఆ పాత్రచేత యుగళగీతం కూడా పాడించిన ఘనత రామారావుగారిదే

ఈ సందర్భంలో ఎన్.టి.రామారావుగారి దుర్యోధన పాత్రల గురించి సి.నా.రె గారు ముఖాముఖిలో చెప్పిన మాటలను మరోసారి పరిశీలిద్దాం - "శిల్పాన్ని సమకూర్చిన ప్రపంచంలోనే గొప్ప పౌరాణిక, చారిత్రక, జానపద, సాంఘిక చలనచిత్రాల్లో ఏ నటుడూ అభినయించని పాత్రల వైవిధ్యం, వైవిధ్యంలోని వైశిష్ట్యం చూపిన మహానటుడు శ్రీ నందమూరిగారు. దుర్యోధనుడికి డ్యూయెట్ రాయటం అదొక అపురూప ప్రయోగం" అంటారు నిజంగానే చిత్రరంగంలో తిరుగులేని స్థానం వారిది.

వీరి దుర్యోధన పాత్ర చిత్రణను చిత్రాలవారీగా పరిశీలిద్దాము.

***శ్రీకృష్ణపాండవీయం***

ఎన్.టి.రామారావుగారి స్వీయదర్శకత్వంలో ప్రతినాయకుని కథానాయకుడి స్థాయిలో చూపించిన చిత్రం ఇది. దర్శకుడిగా వారి ప్రతిభకు పట్టం కట్టిన కళాత్మక చిత్రం రాముడికి ప్రతిగా రావణాసురుని, కృష్ణుడికి ఎదురుగా దుర్యోధనుని పాత్రలు పోషించి తనలోని

నటుని పరితృప్తుని చేసుకున్నారు. పురాణాలను కొత్తకోణం నుండి ఆవిష్కరించారు. దుష్టపాత్రలలో మంచిని, వారికున్న గొప్పగుణాలను వెలికితీసి ప్రతిమానవుడిలో మంచి వుంటుందనే సత్యానికి తెరతీసిన ఘనత రామారావుగారిదే. నటుడిగా వారి అహం సంతృప్తిపడటమే కాదు. పాత్రల స్వభావాలను గుర్తించటం ద్వారా కూడా మానవతకు మహనీయత్వం అద్దారు శ్రీరామారావుగారు. ఒకరకంగా ఇది సమాజానికి ఎదురీతే అయినా విజయాన్ని సాధించటంలోనే వుంది ప్రతిభకు నిదర్శనం. దాని వెనుక ఎంత నేపధ్య కృషి వుందో ఆలోచిస్తే అర్థం అవుతుంది. వారి మాటల్లోనే ఆ విషయాన్ని గ్రహించవచ్చు. తెల్లవారుఝామున 3గంటలకే లేచి వ్యాయామం చేసి స్నానం ముగించాక ఆ రోజు తాను నటించబోయే పాత్రల స్వరూప స్వభావాలను బాగా అధ్యయనం చేసేవారట. తాను అనుకున్న 'ఎఫెక్ట్' వచ్చేవరకు ఆ దృశ్యాన్ని తీయాల్సిందే - "ఏ పాత్ర పోషించినా దానికి ప్రాణం పొయ్యటమే నా కర్తవ్యం. దాన్ని సరైన మార్గంలో గుర్తించి తగిన హావభావాలు కూర్చుకుని అవగాహనతో నటించటం నా బాధ్యత. అటువంటి ప్రశాంతమైన అవగాహనా స్థితి. తెల్లవారుఝామున అందరూ నిద్రించే ఆ సమయంలోనే కుదురుతుంది. అందుకే ఆ సమయాన్ని నేను చాలా ఇష్టపడతాను. నాకు సంబంధించి కీలకమైన నిర్ణయాలన్నీ జరిగేది ఒక్క బ్రహ్మముహూర్తంలోనే."

భిన్నమైన గెటప్‌లో పాండవ శత్రువు అభిమానధనుడు. దశాక్షౌహిణీ సేనానాయకుడు. నూర్గురు సోదరులకు అగ్రజుడు, పౌరుషాహంకారాలు మూర్తీభవింపచేసుకున్న సుయోధనుడి పాత్రలో తనే ధరిస్తున్నా కృష్ణపాత్రతో ధీటుగా నటించటం అందరికీ సాధ్యమయ్యే పనికాదు. స్వరూప స్వభావాలు పూర్తిభిన్నమైన రీతిలో పాత్రలు వేరనే భావన కలిగే విధంగా అభినయించటం గొప్ప కళ. రెండు పాత్రలను సమంగా నడిపించినప్పటికీ కొన్నిచోట్ల పాత్ర స్వభావానికి అనుగుణంగా వున్న కొన్ని సంకుచిత భావాల వలన దుర్యోధన పాత్ర పైచేయి కాలేకపోయింది. అయినప్పటికీ నటనలో రామారావుగారు కృష్ణపాత్ర కంటే ఈ పాత్రలోనే చిత్రంలో మంచి పేరు తెచ్చుకున్నారు. బహుశా వైవిధ్యమైన పాత్ర అయినందువల్ల కావచ్చు.

చిత్రంలో ప్రధానమైన రెండు పాత్రలను సమతూకంగానే పాటించారు. శ్రీకృష్ణుడు కుంతిని కలిసి ఆమెను ఓదార్చే ఘట్టంతో చిత్రం ప్రారంభమై ఆ తరువాత చిత్రం, పేరు వగైరాలు వచ్చి, ఆ పై మొదలయ్యే మొదటి ఘటంలో సుయోధనుడు దర్శనమిస్తాడు. తరతరాల రాజసాన్ని నింపుకుని భుజంపై గాతో పటుతరమైన సంభాషణలు దానికి తగిన వాచికాభినయంతో ఈ పాత్ర ప్రవేశిస్తుంది. ఈ సన్నివేశ చిత్రీకరణ సమయంలో జరిగిన ఒక సంఘటన ఇక్కడ గుర్తుచేసుకోవలసి వుంది. 'శ్రీకృష్ణపాండవీయం' చిత్ర నిర్మాత శ్రీ నందమూరి త్రివిక్రమరావుగారు. వీరు రామారావుగారి సోదరులు. వీరిద్దరి మధ్య ఒక విచిత్రమైన అవగాహన వుండేది. సెట్‌లో ఎప్పుడూ మాట్లాడుకునే వాళ్ళు కారు. కళ్ళతో సైగలు చేసుకోవటమే. మిగిలినవారికెవరికీ ఈ భాష అర్థమయ్యేది కాదు.

"శ్రీకృష్ణపాండవీయం షూటింగ్ జరుగుతోంది. దర్శకుడు ఎన్.టి.ఆర్ గారు ప్రతిరోజూ ఉదయం ఆరుగంటల ప్రాంతంలో ఆ ముందురోజు జరిగిన రషెస్ చూసేవారు. ఆ రషెస్ చూద్దం వాహినీ స్టూడియో 'ఎ'థియేటర్‌లో, ఆపరేటర్ పాండు పెద్దాయన చిన్నాయన మందీ మార్బలంతో కలసి వస్తున్నారంటే ఎంతో సందడిగా, రషెస్ వారికి తృప్తి కలిగించే రీతిలో సిద్ధం చేసేవాడు" (ఆంధ్రభూమి - 28 జూలై 1996)

అలవాటు ప్రకారం ఆరోజు కూడా రామారావుగారు త్రివిక్రమరావుగారు ఛాయాగ్రహకుడు రహమన్, పుండరీకాక్షయ్య, బలరాం, రుక్మాంగరధరరావు, మేకప్‌మాన్ పీతాంబరం అందరూ వచ్చారు. పన్నెండు వందల నిడివి వున్న షాట్ అది. దుర్యోధనుడి పాత్ర రషెస్ అద్భుతంగా వచ్చింది.

పన్నెండు వందల నిడివితో వున్న ఆ షాట్‌లో ఎన్.టి.ఆర్.గారు దుర్యోధన పాత్రలో అద్భుతంగా వున్నారు. రషెస్ చూస్తూ ఆనందంతో అందరూ చప్పట్లు కొట్టారు. నిర్మాత త్రివిక్రమరావుగారి సంతోషానికి మేరలేదు. అయితే ఎన్.టి.ఆర్గారు సీరియస్‌గా వుంటే అందరూ ఆందోళన పడ్డారు. చివరకు తేలిందేమిటంటే ఎవ్వరూ గుర్తించని ఒక చిన్న లోపాన్ని వారు బయటపెట్టారు. దుర్యోధనుడి

ఫ్రేమ్‌లోకి అడుగుపెడుతున్నప్పుడు కిరీటం కొద్దిగా కదులుతుంది. అది మళ్ళీ చిత్రీకరించాలని చెబితే త్రివిక్రమరావుగారు బాధపడుతూ - "మీరు దర్శకులు కనుక బాధలేదు. ఎన్నిమార్లయినా తీయమంటారు. కానీ డబ్బు ఖర్చు చూసుకునేవాడు నిర్మాత. సమయం, డబ్బూ అన్నీ ఇబ్బందే - ఐనా దాన్ని ఓ సెంటిమెంట్‌గా మార్చుకోవచ్చుగా - కిరీటం కదిలింది కనుక కురుక్షేత్ర సంగ్రామంలో తన సర్వస్వం కోల్పోయే దానికి అశుభ సూచనగా సరిపెట్టుకోవచ్చుగా" అని సలహా ఇచ్చారు. తమ్ముడి తెలివి తేటలకు ఎన్.టి.ఆర్ గారు ఆనందించి పునఃచిత్రీకరించడం మానేశారు. ఈ సినిమా విడుదలయ్యాక పెద్ద సంచలనం వచ్చింది. రామారావుగారి 'విరోధపాత్ర' నెగిటివ్ రోల్‌ను కూడా ప్రజలు ఆనందంగా స్వీకరించారు.

దుర్యోధన పాత్ర ప్రవేశం అట్టహాసంగా జరిగింది. ఒళ్ళంతా బంగారు ఆభరణాలు, కంఠహారం, భుజకీర్తులు, మెళ్ళో తెల్లపూలమాల కిరీటం తీరేవేరు. గోపురంలా లేచి చాలా ప్రత్యేకమైన నమూనా. సుయోధన సార్వభౌముని స్థాయికి తగ్గట్లు, నిండుగా వుంది. కిరీటంలో నుదుటిమీద పడగెత్తిన పాముబొట్టు. ఆ పాత్ర స్వభావాన్ని, గద ధరిచిన తీరు, పౌరుషాన్ని, పంచె బిగించి కట్టిన విధానం అహంకారాన్ని, ఇన్ని భావాలను ఆహార్యంలోనే సగం అందించారు. మూడు కిలోల లోహపు కిరీటం, చాలా ప్రత్యేకమైన ఆకర్షణ. నటుడి ప్రత్యేకత ఆహార్యాన్ని ఎంచుకోవటంలో వుంటుంది. ఈ పాత్రకు కూర్చిన సంభాషణలు కూడా విలక్షణమైన శైలిలో అటు సంప్రదాయం చెడకుండా, ఇటు నవ్యత తగ్గకుండా సాగింది. వాటిని రామారావుగారు రూపొందించుకున్న తీరు మరింత విలక్షణంగా వుంటుంది. వాచికాభినయంలో శైలీకరణగా ఒక గొప్ప తార్కాణంగా నిలిచిపోతుంది. "నవ కండ భూ ఖండ పరీవ్యాప్తమై" అంటూ దీర్ఘ సమాసాలతో సాగిన ఆ మాటలలో వగరు - పొగరు స్ఫుటమైన ఉచ్చారణ కొత్త శోభను తెస్తుంది. అందులో శబ్దాడంబరమే కాదు. భావ వ్యక్తీకణ కూడా సుబోధమై - సులభమై సాహిత్య సౌందర్య స్ఫోరకంగా వుంటుంది.

ఉచ్చారణలో ఆ హెచ్చు తగ్గుల రీతి (మాడ్యులేషన్) వారికి తెలిసినట్లు మరెవరికి తెలీదు. దాని వెనక వారి కృషి, చిత్ర రచన (స్క్రిప్ట్)ను అధ్యయనం చేసే పద్ధతే వేరుగా వుంటుంది. ఇప్పటి నటులు చిత్రీకరణకు వచ్చే వరకు పాత్రేమిటో, సంభాషణేమిటో తెలుసుకునే స్థితి వుండదు. అప్పుడు చెప్పిన మాటలను చిలుకపలుకుల్లా పలకటం తప్ప పాత్ర స్వరూప స్వభావాలను సమగ్రంగా ఆకళింపు చేసికునే నిబద్ధత, నిమగ్నత లేకుండా పోతోంది. ఆనాడు ఒక సమిష్టికృషి (టీం వర్క్)గా వుండేది. డబ్బు తక్కువైనా పిక్చరు విజయానికే అందరూ కృషిచేసేవారు. అందుకే అవి అపురూప కళాఖండాలుగా మిగిలిపోయాయి.

పాండవుల మీద మత్సరం పెంచుకున్న దుర్యోధనుడు పాండవులను కాశీకి పంపించి, లక్క ఇంట్లో వుంచి చంపించటానికి తండ్రిని ఒప్పిస్తాడు. దాని వెనక కర్ణుడి - శకుని ప్రోత్సాహం వుంటుంది. ఆ సమయంలో అంధుడైన తండ్రిని సింహాసనాధిష్టుడైన మహారాజును పిలిచే దృశ్యం చాలా అనౌచిత్యకరంగా వుంది. సింహాసనం మీద ముని వ్రేళ్ళతో టకటకా తట్టి పిలవడం, ఆ సింహాసనాన్ని, మహారాజస్థితినే అవమానించే రీతిగా వుంది. అతడి గ్రుడ్డితనాన్ని ఎత్తిచూపుతున్నట్టు, అహంకారంతో కన్నూమిన్నూ గానని గర్వాతిశయమున్నట్లు తీవ్ర నిర్లక్ష్యవైఖరి. ఆ రీతి వున్నట్లు అభినయంలోనైతే బాగానే చూపించారు కానీ పాత్ర ఔచిత్యం అనే విషయాన్నే మర్చిపోయారు. ధృతరాష్ట్రుల రాజ్యం నుండీ పాండవులు వైదొలగాలని, లేకపోతే అంధులైన తల్లిదండ్రులతో, శతసోదరులతో, తానే అడవికి పోతానని బెదిరిస్తాడు. ఈ సన్నివేశమేకాదు. చిత్రం మొత్తంపై అణువణువు నింపుకున్న అహంకారం, తనకెదురులేదనే ధీమా, తల్లిదండ్రుల గారాంబ వెరసి దుర్యోధనుడవుతాడు. ఈ చిత్రంలో మొత్తంపై దుర్యోధన పాత్ర తీర్పులో ఔచిత్యానికి భంగం చాలాచోట్ల అగుపించినా ఆ పాత్రను మాత్రం మనోరంజకంగా మనముందు నిలబెట్టగలిగారంటే దానికి కారణం వివిధ రీతుల అభినయంలో అంటే ఆంగిక, వాచిక ఆహార్యాదులలో వారు రూపొందించిన శైలీకరణ విశిష్టతే సగం కారణం.

లక్క ఇంటిలో మరణించక ద్రౌపదిని పెళ్ళాడి పాండవులు తిరిగి హస్తినకు రావటంతో దుర్యోధనుడి బాధ మొదలవుతుంది. ధృతరాష్ట్రుడు ఖాండవప్రస్థం పాండవులకు కేటాయించినప్పుడు, తన శత్రువుల వున్నతిని చూసి, ఓర్చుకోలేక కుమిలిపోయే దుర్యోధనుడి బాధను తనదైన విలక్షణ రీతిలో ఎన్.టి.ఆర్ గారు కేవలం నేత్రాల ద్వారా అభినయించి చూపారు.

శ్రీకృష్ణ, శ్రీరామ పాత్రలకు సహజంగా నప్పుతుందనిపించిన గంభీరమైన ఆ ముఖాకృతిలో ప్రతినాయక ప్రధానమైన ఈర్ష్యా, ద్వేషా స్వభావాలను అలా పలికిస్తారని ఊహించలేము. అందుకే వైవిధ్యం సాధించటంలో ఆయనంత పట్టుదలతో కృషిచేశారు. ఈ సన్నివేశంలో రామారావుగారికిష్టమైన పద్యం ఒకటుంది.

"కంటికి నిద్రవచ్చునే, సుఖంబగునే రతికేళి మానుషంబు గల యట్టి మనిషికి శత్రువు తనంతటివాడు కలిగినన్..." అనేది. అందుకే ఎన్.టి.ఆర్, గారి దృష్టిలో దుర్యోధనుడు దుర్యోధనుడు కాదు. అతడు 'సు'యోధనుడు. అభిమానధనుడైన పురుషునికి ప్రతీక సుయోధనుడు. ఎవరు నిందించినా, అసహ్యించుకున్నా, సర్వం నశించినా తను అనుకున్నది చేస్తాడు. ఎక్కడా తలవంచలేదు. చివరి వరకు తన పౌరుషాన్ని కాపాడుకున్నాడనేది రామారావుగారికి ఆ పాత్రపై స్థిరంగా వున్న అభిప్రాయం. అందుకే ఆ పాత్ర తనకు చాలా ఇష్టమైంది అనేవారు.

ఈ చిత్రంలోకెల్లా అత్యంత జనరంజకంగా తయారైనది మయసభ దృశ్యం. దుర్యోధనుడిగా ఆయన నటనకు ఆటపట్టు ఈ ఘట్టమే. రామారావుగారి నటజీవితంలో "భూకైలాస్" చిత్రంలో పేగులు తీసి వీణ వాయిస్తూ శివుడిని మెప్పించే రావణ పాత్ర ఒకటి, శ్రీకృష్ణ పాండవీయంలోని మయసభలో దుర్యోధన పాత్ర ఒకటి. ఈ రెండూ రెండు మైలురాళ్ళుగా మిగిలిపోయాయి. ప్రతినటుడు కోరుకునే విలక్షణ కీర్తిని ఇవి సంతరించి పెట్టాయి.

ఈ మాయసభ దృశ్యంలో రారాజు దుర్యోధనుడిని ప్రేక్షకులముందు పూర్తిగా సాక్షాత్కరింపచేసారు రామారావుగారు. కోరమీసం దువ్వులో దట్టమైన కనుబొమ్మల కనుబొమ్మల మధ్య బాణంలాంటి చూపుల్తో - పిడుగుల్లాంటి అడుగులు వేస్తూ మదించిన మత్తేభంలా, అడుగడుగున, అణువణువున తొణికిసలాడిన విన్యాసాలు ప్రజల హృదయాల్లో స్థిరమైన ముద్రవేశాయి. అద్వితీయమైన నటనాచాతుర్యానికి ఆహార్యం. వాచికాభినయం హారంలో మణుల్లాగా ఒదిగిపోయాయి. అహంభావం, దౌష్ట్యం ముఖంలో కనిపించటానికి కనుబొమలు వంపు తిరిగేట్టు చేశారు. ఇనుప ముక్కలాంటి శరీరంతో వింత ఠీవిని ప్రదర్శింపచేశారు. సాహిత్యం రూపుదిద్దుకుంటే అభినయం, దాన్ని పొందుపర్చుకుంటే ఆహార్యం దుర్యోధనుడి పాత్రలో వాటిని ఆవాహన చేసి సజీవంగా చిత్రించారు రామారావుగారు.

కళాప్రియుడైన సుయోధనునికి అపూర్వ స్వాగతం లభిస్తుంది. చిత్రకథకులు, దర్శకులు అయిన రామారావుగారు మయసభ అందాన్ని చూసి ఒకవైపు ఆనందం మరోవైపు ఈర్ష్య, అర్థంగాని చోటుల్లో పాండవులు తన్నవమానిస్తున్నారనే కోపం ఇన్ని భావాలు ఏకకాలంలో చూపించగలిగారు ముఖంలో భావప్రకటన ఒక ఎత్తయితే, ఆ సంభాషణలు చెప్పటంలోని విలక్షణ శైలి మరొక ఎత్తు. అంతటి అద్భుత సభను ఒక వున్నత రాజవంశీకుడు ఎలా అభినందిస్తాడో కళ్ళముందు నిలుపుతాడు.

ఈ చిత్రంలో మయసభ భారతంలో సభాపర్వంలో నన్నయగారి వర్ణనకు అనుగుణంగా వేసారు. 'వివృతంబైన ద్వార దేశంబు సంవృతంబుగా వగచి, చొరనొల్లక సంవృతంబైన దాని వివృతంబుగా వగచి చొరంబోయి లలాట ఘట్టిత గృహద్వారుండయి సమప్రదేశంబున్నతంబుగా వగచి, పరిధానం బెగ్గ్రోచికొని స్పటిక దీప్తిజాల పరివృతంబైన జలాశయంబు స్థలంబుగా వగచి కట్టిన పుట్టుంబుడడియం జొచ్చి క్రమ్మరినవానింజూచి బాంచాలియు బాండుకుమారులు నగిరంత"

భారతదృశ్యం కళ్ళకు కట్టినట్లున్న మహా భవన నిర్మాణం రామారావుగారు ఎంత నిశితంగా పురాణ వాఙ్మయాన్ని అధ్యయనం చేసి తమ చలనచిత్రశైలిని రూపొందించుకునేవారో, అందులో ఎన్ని మెరుగులు దిద్దేవారో తెలియజేస్తుంది. అందువల్లే రామారావుగారు ఆయన 'రావణ' పాత్రలాగే భారత దుర్యోధనుని పాత్రను ఒక కొత్త దృక్కోణం నుంచి అన్ని విధాల రసపారీణతను ప్రదర్శించేలా

రూపొందించారు. మరెక్కడా కానరాని విధంగా ఆ ఘట్టాన్ని అద్భుత రసాత్మకంగా, దాని స్థాయీభావమైన విస్మయం ద్యోతకమయ్యేలా రూపొందించారు. అలాగే శృంగారాన్ని కూడా నారాయణరెడ్డిగారన్నట్లు దుర్యోధనుడిలో శృంగారరసాన్ని చూపెట్టిన మహానటుడాయన.

"మందిర మధ్యమున జలాశయమూ.." అంటూ నీళ్ళల్లో పడి అవమానం పాలవుతాడు. పరిచారికల నవ్వు బాధించలేదుగానీ ద్రౌపది చూడటం అభిమానధనుడైన అతడిని క్రుంగదీసింది. రోషంతో రగిలిపోయాడు. బాధతో క్రుంగిపోయాడు. సుయోధనుడి క్షోభ, రామారావుగారు నిజంగా అనుభవించినట్లే అభినయించి చూపారు - "పాంచాలీ పంచ భర్తృకా! ఆహా! నేడొక అబల, బంధకి పరిహసించుటయా. విని సహించుటయా, సహించక మరణించుటయా" అనటంలో అవమానభారం తట్టుకోలేని అభిమాని మనస్తత్వాన్ని గొంతుతోనూ, ముఖంతో పోటీపడి చూపించారు.

ఆ పైన శకుని "కపట జూదంలో పాండవులను సర్వం ఓడించి తలవంచుకునేటట్లు చేసి నిన్ను అవమానించిన ఆ ద్రౌపదిని నిండుసభలో వలువలూడదీసి వాళ్ళ విలువలు దిగజారుస్తాను. భారత చరిత్రలో నీ కీర్తి సువర్ణాక్షరాలతో లిఖించేటట్లు చేస్తాన"ని ఓదార్చి రాజసూయానికి తీసుకెళ్తాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments